క్లుప్తంగా

యువకుల రక్తదానం



అప్పనపల్లిలో రక్తదానం చేస్తున్న చిరు పవన్ సేవా సమితి సభ్యులు

మామిడికుదురు: గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ పుట్టిన రోజును పురస్కరించుకుని అప్పనపల్లిలో ఆదివారం మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. చిరు, పవన్ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 30 యూనిట్లు రక్తదానం చేశారు.

మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు అడబాల తాతకాపు మాట్లాడుతూ ఆపదలో ఉన్న ఎంతో మందికి చిరు, పవన్ సేవా సమితి ద్వారా రక్తం అందించి ప్రాణదాతలయ్యారని కీర్తించారు. ఇదే స్ఫూర్తితో రక్తదానం ద్వారా ప్రాణదాతలు కావాలన్నారు. కార్యక్రమంలో తులా ఆదినారాయణ, వీధి సత్తిబాబు, తులా ఉమ, బొంతు గాంధీ, తులా గోపాలకృష్ణ, కొమ్ముల కొండలరావు, గెడ్డం వెంకటేశ్వర రావు, జాలెం శ్రీనివాసరాజు, పోతు కాశీ, గుండాబత్తుల తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

మెరిట్ స్కాలర్‌షిప్‌లో సంజన ఉత్తీర్ణత



మెరిట్ స్కాలర్‌షిప్‌కు అర్హత సాధించిన సంజనతో ఉపాధ్యాయులు

మామిడికుదురు: తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకు చదివే పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఏటా కేంద్ర ప్రభుత్వం అందించే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) అర్హత పరీక్షలో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని సీహెచ్ సంజన ఉత్తీర్ణత సాధించింది. ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో సంజన ఉత్తీర్ణత సాధించిందని స్కూల్ ప్రధానోపాధ్యాయిని సీహెచ్ నిరంజని ఆదివారం తెలిపారు. సంజనను హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

భగవద్గీత సారాంశాన్ని తెలుసుకోవాలి



వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద జరిగిన శిక్షణలో పాల్గొన్న భక్తులు

అంబాజీపేట: భగవద్గీత సారాంశాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, గీతలోని శ్లోకాలు వాటి అర్థాలను విశదీకరించేందుకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశామని ఆలయ ప్రధానార్చకుడు పాణింగపల్లి నరసింహాచార్యులు పేర్కొన్నారు. అంబాజీపేట కొర్లపాటివారిపాలెంలో కొలువుదీరిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో విష్ణు సహస్ర నామ, భగవద్గీత శ్లోకాలపై ఆదివారం శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. అర్చకుడు నరసింహాచార్యులు మాట్లాడుతూ గురువు ద్వారా పొందిన ఉపదేశానికి ప్రామాణికముంటుందన్నారు.

ఎన్నో శతాబ్దాల క్రితం పంచమ వేదముని మహాత్ములచే చెప్పబడిన భగవద్గీత భక్తి, జ్ఞాన, వైరాగ్యాల అమూల్యమైన సారమున శ్రీకృష్ణ పరమాత్ముడు పాండవ మధ్యముడు అర్జునుడికి వివరించిన దివ్యోపదేశమన్నారు. గీతాసారం పఠనం ద్వారా మానవుల్లో ఉన్న దుర్గుణాలు పారద్రోలి ముక్తి మార్గమునకు మూలమైన మోక్షం ప్రసాదింపబడుతుందన్నారు. ప్రతి ఆదివారం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు నిర్వహించే ఈ శిక్షణను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నరసింహాచార్యులు సూచించారు.

క్రైస్తవులకు ఎస్సీ హోదా తీర్మానం ముదావహం

మామిడికుదురు: దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని కోరుతూ రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేయడం ముదావహమని జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు కనపాల బాబూరావు పేర్కొన్నారు. ఆయన ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ద్వారా ఎంతో మంది పేద దళిత క్రిస్టియన్లకు మేలు జరుగుతుందన్నారు.

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం సాహసోపేతమైందన్నారు. ఎంతో మంది దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కోల్పోవడం వల్ల ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారని బాబూరావు ఆందోళన వ్యక్తం చేశారు. మతం మారడం వల్ల ఎస్సీ హోదా కోల్పోవడం బాధాకరమని, గత ప్రభుత్వాలు ఈ దిశగా ఎప్పుడూ కూడా ఆలోచన చేయలేదన్నారు. దళిత క్రైస్తవులకు మేలు జరిగే విధంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ప్రతి ఒక్క దళితుడు స్వాగతిస్తున్నారన్నారు. సీఎంకు దళిత క్రైస్తవులు ఎంతో రుణపడి ఉంటారని బాబూరావు పేర్కొన్నారు.

సంపూర్ణ పోషణ.. ఆరోగ్య సంరక్షణ

- పోషకాహార ఆవశ్యకతపై అవగాహన
- వచ్చే నెల 3 వరకూ పోషణ పక్షోత్సవాలు



రావులపాలెం మండలం వెదిరేశ్వరంలో పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం



సంపూర్ణ పోషకాల ప్రదర్శన



పిల్లలకు పోషకాహారం తినిపిస్తున్న సీడీపీవో

కొత్తపేట: ప్రజారోగ్యమే పరమావధిగా పరిపాలన సాగిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వివిధ కార్యక్రమాలు అమలు చేస్తుంది. వైద్య ఆరోగ్య శాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖల ద్వారా ప్రజల ఆరోగ్య సంరక్షణలో పాటు, వారికి పోషకాహారం అందిస్తుంది. అందుకు ప్రత్యేకంగా రూ.కోట్లు వెచ్చిస్తుంది. చంటి పిల్లల నుంచి వృద్ధుల వరకూ అందరి ఆరోగ్య సంరక్షణకు పలు పథకాలను అమలు చేస్తుంది. 'సంపూర్ణ పోషణ.. ఆరోగ్య సంరక్షణ'పై అవగాహన కల్పించడం ద్వారా లక్ష్య సాధనకు 'పోషకాహారం అందరికీ అందేలా చూద్దాం.. ఆరోగ్యకరమైన ఆంధ్రప్రదేశ్ కోసం కలసికట్టుగా పనిచేద్దాం' అనే నినాదంతో ఈ నెల 20 నుంచి వచ్చే నెల 3 వరకూ పక్షోత్సవాలు నిర్వహించాలని ఉత్తర్వులిచ్చింది. దీనిలో భాగంగా ఐసీడీఎస్ ప్రాజెక్టుల సీడీపీఓల ఆధ్వర్యంలో ఆయా అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు గ్రామాల్లోనూ పోషణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

కార్యక్రమాలు ఇలా..

ఈ నెల 20 నుంచి పోషణ అవగాహన కార్యక్రమాలు ప్రారంభం కాగా శనివారం వరకూ పోషణ విలువలు, పోషకాహార నిపుణులు, సైన్స్ లెక్చరర్ల ద్వారా ఆహారంలో మిల్లెట్లను చేర్చడం, వాటి వలన కలిగే ప్రయోజనాలపై అవగాహన, పోషకాహార మేళాలు, గర్భిణులు, కౌమార దశలో బాలికలు, పిల్లలకు కమ్యూనిటీ ఆధారిత ఈవెంట్స్ నిర్వహణ, 6 సంవత్సరాల కంటే ఎక్కువ వయసున్న పిల్లల ఎత్తు, బరువు కొలవడం, పోషకాహార లోపం ఉన్న పిల్లలందరినీ గుర్తించడం, పోషణ్ ట్రాకర్ అప్లికేషన్‌లో నమోదు వంటి వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నెల 27 న మిల్లెట్ ఆధారిత అవగాహనలో భాగంగా పోషకాహార లోపాన్ని నిర్మూలించడంలో మినుముల పాత్రపై దృష్టి సారించడం, పాఠశాల, కళాశాల విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహణ, యుక్త వయసులో ఉన్న బాలికలకు రక్తహీనత, రుతుక్రమ పరిశుభ్రత, పోషకాహార ప్రాముఖ్యతపై సెమినార్‌లు నిర్వహణ, 29న డైట్ కన్సలేషన్ క్యాంపుల్లో భాగంగా గర్భిణులు, పాలిచ్చే తల్లుల కోసం పీహెచ్‌సీ/ సీహెచ్‌సీ/ డీహెచ్‌సీల వద్ద పోషకాహారంపై అవగాహన. 30న వంటల పోటీల్లో భాగంగా మిల్లెట్ ఆధారిత సంప్రదాయ వంటల పోటీలు నిర్వహిస్తారు. 31న ఏఎన్ఎం, ఆశ, హెల్త్ సబ్ కమిటీ సభ్యులు ఉమ్మడి గృహ సందర్శనల ద్వారా పిల్లలు, హైరిస్క్, ఎనీమియాపై ప్రత్యేక దృష్టితో గర్భిణులు, బాలింతలను, 7 నెలల నుంచి 24 నెలల పిల్లలకు సందర్శనలను అనుసరించడం. 1న రోజువారీ సూక్ష్మ పోషకాల ప్రాముఖ్యతపై తల్లులకు అవగాహన కల్పించడం, న్యూట్రీగార్డెన్‌లకు ఎక్స్‌పోజర్ సందర్శన నిర్వహించడం, మిల్లెట్ ఆధారిత వ్యవసాయం ద్వారా సామాజిక, ఆర్థిక విలువల సృష్టిపై రైతులకు శిక్షణ. 3న ముగింపు వేడుకల్లో భాగంగా స్థానిక ప్రజాప్రతినిధుల సమక్షంలో ఏడబ్ల్యుసీలో ×హెల్త్ బేబీ షో× నిర్వహణ, అన్ని పోటీల్లో విజేతలకు బహుమతులు పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తారు.

చురుగ్గా పక్షోత్సవాలు



ప్రజలందరూ పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలి. ఆరోగ్యంగా జీవించాలనే లక్ష్యంతో ప్రభుత్వం నిర్దేశించిన పౌష్టికాహార పక్షోత్సవాలు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో చురుగ్గా, ఉత్సాహంగా సాగుతున్నాయి. షెడ్యూల్ ప్రకారం రోజువారీ కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు తీసుకున్నాం. దానిలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ముఖ్యంగా పిల్లలు, గర్భిణులు, బాలింతలు, వృద్ధులకు వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– పి.శారద, సీడీపీఓ, కొత్తపేట

కార్యకర్తలే పార్టీకి పునాది



రాజోలు మండల పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

రాజోలు: కార్యకర్తలే పార్టీకి పునాది అని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. ఆదివారం వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కార్యకర్తల కృషే కారణమన్నారు. కార్యకర్త లేకపోతే ఏ రాజకీయపార్టీకి భవిష్యత్ ఉండదన్నారు. గ్రామస్థాయిలో పార్టీ కార్యకర్తలు స్తబ్దతగా ఉండవద్దని వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా నిలుస్తుందన్నారు. సీఎం జగన్ సారథ్యంలో రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగుతుందన్నారు. ఏఎంసీ చైర్‌పర్సన్ గుబ్బల రోజామణి, జెడ్పీటీసీ మట్టా శైలజ, సూర్యబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కోటిపల్లి ఎస్తేరు రాణి, నెడ్‌క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్, రాజోలు సర్పంచ్ రేవు జ్యోతి, మట్టా ఏడుకొండలు, దార్ల పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆక్సిజన్ అసోసియేషన్‌కు బెస్ట్ యూత్ క్లబ్ అవార్డు



బెస్ట్ యూత్ క్లబ్ అవార్డు అందుకుంటున్న అధ్యక్షుడు గంగాధరం

మామిడికుదురు: పాశర్లపూడి కేంద్రంగా పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆక్సిజన్ అసోసియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బెస్ట్ యూత్ క్లబ్ అవార్డు అందుకుంది. కాకినాడ స్పోర్ట్స్ అథారిటీ గ్రౌండ్‌లో జరిగిన సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు కటికిరెడ్డి గంగాధరం, సభ్యుడు మొల్లేటి తలుపులు ఉత్తమ యూత్ క్లబ్ అవార్డును అందుకున్నారు. కేంద్ర ప్రభుత్వ యువజన సర్వీసుల క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పని చేసే నెహ్రూ యువ కేంద్రం జిల్లా సమన్వయాధికారి అమృతేష్ చేతుల ఈ అవార్డును అందుకున్నామని అసోసియేషన్ అధ్యక్షుడు గంగాధరం ఆదివారం తెలిపారు. జ్ఞాపికతో పాటు రూ.25 నగదు ప్రోత్సాహం, సర్టిఫికెట్ అందించారన్నారు. తమ అసోసియేషన్‌కు అవార్డు దక్కడం ఎంతో ఆనందంగా ఉందని గంగాధరం చెప్పారు. ఇదే స్ఫూర్తితో యువతలో చైతన్యం తీసుకువచ్చే పలు కార్యక్రమాలు చేపడతామన్నారు. నాబార్డు ఏజీఎం వైఎస్ నాయుడు, వేగి వెంకటేశ్వరరావు, రమేష్‌తో పాటు పలువురు అసోసియేషన్ ప్రతినిధులను అభినందించారు.

ఉనికి కోసమే టీడీపీ రీసైక్లింగ్ రాజకీయాలు



అవిడిలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు దేవిడ్‌రాజు, గంగాధరరావు, వీరభద్రరావు, చంటి తదితరులు

కొత్తపేట: నియోజకవర్గంలో టీడీపీ నాయకులు ఉనికి చాటుకోవడం కోసం ఆ పార్టీ నాయకులు ఆ పార్టీ వారికే పార్టీ కండువాలు కప్పి రీ సైక్లింగ్ రాజకీయాలకు తెరలేపారని వైఎస్సార్ సీపీ నాయకులు ఎద్దేవా చేశారు. మండలంలోని అవిడి పెద్ద చెరువుగట్టు ప్రాంతంలో గౌడ సామాజిక వర్గానికి చెందిన టీడీపీ కార్యకర్తలకే ఆ పార్టీ కండువాలు కప్పి, వారిని వైఎస్సార్ సీపీ కార్యకర్తలుగా ప్రకటించుకోవడాన్ని ఆ ప్రాంత వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో పాటు పార్టీ సానుభూతిపరులు తీవ్రంగా ఖండించారు. ఆదివారం సాయంత్రం పార్టీ నాయకులను ఆహ్వానించి తమ సంపూర్ణ మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సర్పంచ్ రెడ్డి చంటి అధ్యక్షత వహించగా రాష్ట్ర పార్టీ నాయకుడు గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. పలువురు గ్రామ పెద్దలు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీకి చెందిన వారు ఎవరూ టీడీపీకి వెళ్లలేదని, టీడీపీకి చెందిన కుటుంబాల్లో వారికి కండువాలు వేశారని వివరించారు. ఏదో ఒక విధంగా ఉనికి చాటుకోవడం కోసం టీడీపీ వారికే ఆ పార్టీ కండువాలు వేసి వైఎస్సార్ సీపీ వారిగా ప్రకటించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఈ రాష్ట్రంలో గౌడ కులాన్ని గుర్తించింది జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని, జోగి రమేష్‌కు రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం, మార్గాని భరత్ రామ్‌కు ఎంపీ స్థానంతో పాటు, పార్లమెంటరీ పార్టీ చీఫ్ విప్ పదవి కట్టబెట్టారన్నారు. నియోజకవర్గంలో కొత్తపేట ఎంపీపీ పదవిని గౌడ కులానికి ఇచ్చిన ఘనత ఎమ్మెల్యే జగ్గిరెడ్డికే దక్కిందన్నారు. స్థానికుల చిరకాల వాంఛ అయిన డ్రైన్‌ను రూ.6 లక్షలతో నిర్మించగా, రామాలయం అభివృద్ధికి రూ 1.5 లక్షలు విడుదల చేయించిన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు దూళి సూరిబాబు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ నామాడి రాజారత్నం, గ్రామ పార్టీ అధ్యక్షుడు రెడ్డి సుభాష్, కొత్తపేట హెచ్‌డీసీ సభ్యుడు పల్లి దిలీప్, పార్టీ బీసీ విభాగం సభ్యులు పరమట సూర్యప్రకాశరావు, కొండేటి ప్రసాద్, ఎస్సీ విభాగం సభ్యుడు చింతా ప్రేమానందం పాల్గొన్నారు.

రూ.5.50 కోట్లతో అన్నదాన భవనం



శంకుస్థాపన చేసేందుకు చేస్తున్న ఏర్పాట్లు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి సంబంధించి రూ.5.50 కోట్ల నిధులతో భవన నిర్మాణం చేపట్టనున్నట్లు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. వారు మాట్లాడుతూ రోజురోజుకూ ఆలయంలో భక్తుల సందడి పెరుగుతుందన్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్నదాన పథకానికి సంబంధించి రూ.5.50 కోట్లతో భవనం నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి చేతుల మీదుగా సోమవారం ఉదయం శంకుస్థాపన చేస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థికి ప్రజ్ఞా వికాసం బహుమతి



అమలాపురంలో విద్యార్థి స్వాతికి మెమెంటో అందజేస్తున్న ఎమ్మెల్సీ ఐవీ

కొత్తపేట: పదో తరగతి విద్యార్థులకు ఐఎస్ఎఫ్–యూటీఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజ్ఞా వికాసం పేరిట నిర్వహించిన పరీక్షల్లో స్థానిక విద్యాబాలమందిర్ విద్యార్థిని పసుపులేటి సూర్య వెంకట దుర్గాస్వాతి మండల ప్రైవేట్ పాఠశాలల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిందని ఆ పాఠశాల కరస్పాండెంట్ ఆర్.అనూరాధ ఆదివారం తెలిపారు. అమలాపురంలో విజేతలకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ) చేతుల మీదుగా మెమెంటో, మెడల్, సర్టిఫికెట్ అందజేసినట్టు తెలిపారు.

28న ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ రాక

కొత్తపేట: ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన బొమ్మి ఇజ్రాయిల్ ఈ నెల 28న తొలిసారిగా జిల్లాకు వస్తున్నట్టు మాదిగ పొలిటికల్ జేఏసీ కన్వీనర్ కముజు శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆయన కొత్తపేటలో విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే కోటాలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ మాదిగ కులం నుంచి ఇజ్రాయిల్‌కు స్థానం కల్పించడంపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మాదిగ పొలిటికల్ జేఏసీ తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. 28న జిల్లా ముఖద్వారం రావులపాలెంలో ఇజ్రాయిల్‌కు ఘనస్వాగతం పలికి, అక్కడి నుంచి భారీ ఊరేగింపుగా తోడ్కొని వస్తామన్నారు. ఊరేగింపు కొత్తపేట, ముక్కామల, కె.పెదపూడి, అంబాజీపేట, అమలాపురం మీదుగా ఆయన స్వగ్రామం అల్లవరం మండలం గోడి వరకూ సాగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి కోనసీమ వ్యాప్తంగా మాదిగ కులస్తులు అత్యధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జేఏసీ సభ్యులు ఎన్ ధనరాజ్, యు.శ్రీనుబాబు, టి.వెంకట్రబాబు, కె.మోషే, సీహెచ్ వెంకటేశ్వరరావు, ఎం.సత్యనారాయణ, యు.మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబంలో సంక్షేమం



అయినవిల్లిలో మహిళకు పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

ఎమ్మెల్యే చిట్టిబాబు

అయినవిల్లి: సంక్షేమ పథకాలు అమలుతో రాష్ట్రంలోని ప్రతి కుటుంబం ఆనందంగా గడపాలనే ధ్యేయంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు తెలిపారు. ఆదివారం అయినవిల్లిలో జరిగిన గడపగడపకూ కార్యక్రమం ఎమ్మెల్యే చిట్టిబాబు ఆధ్వర్యంలో జరిగింది. గ్రామంలో గడపలకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సీఎం జగన్ ప్రతి ఒక్కరూ సుభిక్షంగా ఉండాలని కోరుకుంటున్నారన్నారు. కరోనా విపత్తు సమయంలో కూడా ప్రజలకు సీఎం అండగా నిలిచారన్నారు. నిరుపేదలు ఇళ్లు కట్టుకునేందుకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారన్నారు. చేతి వృత్తి చేసుకునే వారిని, చిన్న చిన్న వ్యాపారులకు చేదోడు ద్వారా ఆర్థిక సాయం అందజేశారన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా పేద ప్రజలకు భరోసా కల్పిస్తున్నారన్నారు. రైతులను అనేక విధాలుగా ఆదుకుంటున్నారన్నారు. డ్వాక్రా మహిళలకు రుణామాఫీ ద్వారా చేయూతనిచ్చారన్నారు. తన దృష్టికి వచ్చిన గ్రామంలో సమస్యలను పరిష్కరిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ వేటుకూరి వెంకట్రాజు, వైస్ ఎంపీపీ బయ్యా చిన్నబాబు, నాయకులు గుత్తుల నాగబాబు, మట్టపర్తి రామారావు, గుత్తుల శ్రీరామ్మూర్తి, యడ్ల కిరణ్‌బాబు, కొనే చంద్రశేఖర్, యేడిద వెంకటేశ్వరరావు, పితాని పండు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి రూ.వేల కోట్లు ఖర్చు



కె.ఏనుగుపల్లిలో సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

పి.గన్నవరం: రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం రూ.వేలాది కోట్లు ఖర్చు చేస్తుందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మండలంలోని కె.ఏనుగుపల్లిలో రూ.8 లక్షలతో రెండు సీసీ రోడ్ల నిర్మాణానికి ఆదివారం ఆయన భూమి పూజ చేశారు. మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు తోలేటి బంగారు నాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో చిట్టిబాబు మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు సీఎం జగన్ నిరంతరం శ్రమిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, సర్పంచ్ తోరం సత్యనారాయణ, ఎంపీటీసీ కొల్లే సూర్యనారాయణ, నాయకులు కొల్లే శ్రీను, దొమ్మేటి దుర్గారావు, కడలి సీతారాముడు, శేరు తిరుపతిరావు, సత్తిబాబు, గంధం ఏసు, సూదా శ్రీను, యల్లమెల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య యువజన సంఘం ఆదర్శంగా నిలవాలి



కొత్తపేటలో యువజన సంఘం నూతన అధ్యక్షుడు నాగేశ్వరరావును అభినందిస్తున్న సంఘ నాయకులు

కొత్తపేట: సమాజంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ఆర్యవైశ్య యువజన సంఘం ఆదర్శంగా నిలవాలని జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు సూచించారు. ఆర్యవైశ్య యువజన సంఘం నూతన కార్యవర్గం ఎన్నికకు సంబంధించి ఆదివారం స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో సంఘ సభ్యులు సమావేశం నిర్వహించారు. మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శ్రీఘాకోళ్లపు బాబి అధ్యక్షత వహించగా జిల్లా సంఘం ఉపాధ్యక్షుడు సత్యవరపు జమీందార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ కొత్తపేట ఆర్యవైశ్య యువజన సంఘం అంటే ఉమ్మడి జిల్లాలోనే మంచి పేరుందని, పదవే పరమావధి కాకుండా సంఘానికి, సమాజ సేవా కార్యక్రమాలకు కొంత సమయం కేటాయించి, సేవాదృక్పథంతో పనిచేసే యువకులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడిగా అత్యం నాగేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పలువురు యువకులను కార్యవర్గ సభ్యులుగా గుర్తించగా పూర్తి కార్యవర్గాన్ని త్వరలో ప్రకటిస్తామని సభాధ్యక్షుడు బాబి తెలిపారు. సమావేశంలో సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కంకటాల సత్యనారాయణమూర్తి, స్థానిక ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కోట్ల ప్రభాకర విశ్వేశ్వరరావు, జిల్లా మెడికల్ కమిటీ చైర్మన్ డాక్టర్ పి.కృష్ణారావు, జిల్లా సంఘం సభ్యులు తమ్మన సాయిప్రసాద్, గమిడి ఆనంద్, మండల సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీఘాకోళ్లపు శ్రీనివాస్, కార్యదర్శి చిన్ని, కోశాధికారి కంకటాల గణేశ్వరరావు, తమ్మన రమేష్ పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు

కొత్తపేట: పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకుని ముస్లింలకు ఇతర మతస్తులు ఇఫ్తార్ విందు ఇవ్వడం సాంప్రదాయం. దానిలో భాగంగా బీసీ యువజన సంఘం నాయకుడు మట్టపర్తి జితేంద్ర ఆదివారం సాయంత్రం ముస్లింలకు సోదరులకు స్థానిక మార్కెట్ వీధి మసీదులో ఇఫ్తార్ విందు ఇచ్చారు. పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. జితేంద్రను పలువురు అభినందించారు. విందు స్వీకరించిన ముస్లింలు జితేంద్రకు కృతజ్ఞతలు తెలిపారు.

అనాస మొక్క వేరుకు కాయ



పెదపళ్లలో వేరు దశలో అనాస మొక్కకు కాసిన కాయ

ఆలమూరు: మండలంలోని పెదపళ్లలో అనాస మొక్క వేరు పిలకకు కాయ కాసింది. గ్రామానికి చెందిన గొడవర్తి సూర్యనారాయణ తన పెరట్లో ఇటీవల చిన్న మొక్కను తీసుకుని వచ్చి నాటాడు. అయితే పాతిన నెల రోజుల వ్యవధిలో వేరు దశలో ఉండగానే పిందె పూసి కాయగా మారింది. మరో పక్షం రోజుల్లో పక్వానికి వచ్చే అవకాశం ఉందని యజమాని సూర్యనారాయణ చెబుతున్నారు.

శ్రీరామ సప్తాహం ప్రారంభం

ఆలమూరు: మండలంలోని చింతలూరులో నూతనంగా నిర్మించిన శ్రీపట్టాభి రామచంద్రస్వామి ఆలయంలో ఆదివారం శ్రీరామ సప్తాహం ప్రారంభమైంది. ఆలయ కమిటీ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ఈ సప్తాహంలో జిల్లాలో ప్రసిద్ధి చెందిన భజన బృందాలు పాల్గొని భక్తి కీర్తనలు ఆలపించారు. రామాయణంలోని ఘట్టాలను పద్యాల రూపంలో వివరించారు. వేకువజామున నిర్వహించిన మేల్కొలుపు సేవ, రాత్రి నిర్వహించిన పవళింపు సేవ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

అట్టలు, పెన్నుల పంపిణీ

అయినవిల్లి: మండలంలోని విలస జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు గ్రామానికి చెందిన చిల్లా నరసింహమూర్తి, గుండుమోగుల శ్రీనివాసరావు ఆదివారం పరీక్ష అట్టలు, పెన్నులు, కంపాస్‌బాక్సులు పంపిణీ చేశారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయ సిబ్బంది, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు అభినందించారు.

కొబ్బరి అభివృద్ధి మండలి కార్యాలయాన్ని అమలాపురానికి మార్చాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ కిసాన్ మోర్చా కార్యావర్గ సభ్యుడు నల్లా పవన్‌కుమార్

అయినవిల్లి: విజయవాడలో ఉన్న కొబ్బరి అభివృద్ధి మండలి రాష్ట్ర కార్యాలయాన్ని అమలాపురానికి మార్చాలని బీజేపీ కిసాన్ మోర్చా కార్యావర్గ సభ్యుడు నల్లా పవన్‌కుమార్ కోరారు. ఆదివారం అయినవిల్లిలోని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు విళ్ల దొరబాబు స్వగృహంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నల్లా పవన్ మాట్లాడుతూ కోనసీమ పరిసరా ప్రాంతాల్లో కొబ్బరి ఆధారిత పరిశ్రమలు రావాలన్నారు. ఇందుకోసం ఏర్పాటు చేసిన రాష్ట్ర కొబ్బరి అభివృద్ధి మండలి అమలాపురం పరిసర ప్రాంతాల్లో ఉండటం వల్ల కొబ్బరి రైతులకు మేలు చేకూరుతుందన్నారు.

కోనసీమ జిల్లా పరిధిలో 50,285 హెక్టార్లలో కొబ్బరి సాగవుతుందన్నారు. 668 కొబ్బరి ఉత్పత్తి సొసైటీలు ఉన్నాయన్నారు. 50 కొబ్బరి ఉత్పత్తిదారుల సమాఖ్యలు ఉన్నాయన్నారు. 5 కొబ్బరి ఉత్పత్తిదారుల కంపెనీలు ఉన్నాయన్నారు. రాష్ట్రంలో కొబ్బరి ఉప ఉత్పత్తుల కంపెనీలు రావడం వల్ల రైతులకు మేలు జరుగుతుందన్నారు. కొబ్బరి రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉన్నస్థితి నుంచి ఉన్నత స్థితికి చేరే అవకాశం ఉన్నారు. ఈ విషయమై తాను పార్లమెంట్ సభ్యులు జీవీఎల్ నరసింహారావు, కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ కలిసి చర్చించానన్నారు. ఆయన వెంట జిల్లా కిసాన్ మోర్చా ఇన్‌చార్జ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అడబాల సత్యనారాయణ, కిసాన్ మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి వేగి వెంకటేశ్వరరావు, జిల్లా మోర్చా ఐటీ సెల్ కన్వీనర్ కటికిరెడ్డి తమ్మయ్యనాయుడు యనమదల వెంకటరమణ తదితరులు ఉన్నారు.